
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 193 | బుధవారం 18 నవంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

## 19న మండల పరిషత్‌లు, 20న జిల్లా పరిషత్‌ల

# తొలి సమావేశాలు

## ఏర్పాట్లను సిద్ధం చేసిన అధికారులు






**(అంకుశం, అమరావతి, నవంబర్ 18):**

మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు ఈనెల 19, 20 తేదీల నుంచి అధికారంలోకి రానున్నారు. ఆయా తేదీల నుంచి ఐదేళ్ల పాటు వారు పదవుల్లో కొనసాగుతారు. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19న 659 మండల పరిషత్‌ల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు మండల స్థాయిలో, 20వ తేదీన 28 జిల్లాల్లో జరిగే ప్రత్యేక సమావేశాల్లో ముందుగా కో--ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక, తర్వాత అధ్యక్ష/చైర్‌పర్సన్, ఉపాధ్యక్ష/వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక జరుగుతాయి. ఓటింగ్ చేతులెత్తే పద్ధతిలోనే ఉంటుంది. పార్టీ విప్‌లు కీలకం. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశాలకు హాజరవుతారు కానీ ఓటు హక్కు ఉండదు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్ణయించిన తొలి సమావేశం తేదీ నుంచి ఐదేళ్ల పాటు జడ్పీ చైర్‌పర్సన్లు, మండల పరిషత్ చైర్మన్లు అధికారంలో ఉంటారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

## కపిలేశ్వరాలయంలో వైభవంగా ప్రారంభమైన శ్రీ కామాక్షి అమ్మవారి చండీయాగ మహోత్సవం

**తొమ్మిది రోజుల పాటు విశేష హోమాలు, చండీపారాయణం -- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు**

**అంకుశం న్యూస్ తిరుపతి**
**నవంబర్ 18**




తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో కార్తీక మాస విశేష పూజా, హోమ మహోత్సవాల్లో భాగంగా శ్రీ కామాక్షి అమ్మవారి చండీయాగం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. తొమ్మిది రోజుల పాటు ఈ యాగ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో విశేష పూజలు, నిత్యహోమం, చండీహోమం, లఘుపూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం హోమం, చండీపారాయణం, సహస్రనామార్చన, విశేష దీపారాధన నిర్వహించనున్నారు. భక్తులు రూ.500 టికెట్‌తో ఒకరోజు హోమంలో గృహస్తులుగా పాల్గొనే అవకాశం కల్పించారు. పాల్గొనే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికెతో పాటు అన్నప్రసాదం అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, ఏఈవో శ్రీమతి కుమారి దేవి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# దూసుకొస్తున్న తుపాన్ ముప్పు..

## సహాయం కోసం అందుబాటులో 112, 1070, 18004250101 ఫోన్ నంబర్లు

**(అంకుశం, అమరావతి, నవంబర్ 18):**

బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై హోంమంత్రి అనిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రానున్న 48 గంటల పాటు రాష్ట్రంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని ఆమె ఆదేశించారు. తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అక్వాన్ తుపాను గంటకు కేవలం 8 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నానికి శ్రీకాకుళం-- దక్షిణ ఒడిశా ప్రాంతాల్లో తీరాన్ని దాటే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అంచనా వేశారు. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ గురువారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 13 జాతీయ విపత్తు స్పందన దళాలు, 11 రాష్ట్ర విపత్తు స్పందన దళాలతో పాటు స్థానిక అగ్నిమాపక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. తీర ప్రాంత ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని హోంమంత్రి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం 112, 1070, 18004250101 నంబర్లను సంప్రదించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం, చెట్లు కూలడం, నీటి నిల్వలు, ఇతర సమస్యలపై 'మన మిత్ర' వాట్సాప్ నంబరు 9552300009కు సమాచారం అందించాలని తెలిపారు.




## ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి పోలీసుల నోటీసులు

**(అంకుశం, కడప, నవంబర్ 18):**



వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గ పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇంటికి స్థానిక పోలీసులు బుధవారం వెళ్లి నోటీసులు ఇచ్చారు. అదే సమయంలో వాట్సాప్ ద్వారా కూడా నోటీసు కాపీని పంపించారు. నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా, నామినేషన్ల ప్రక్రియ సమయంలో ఘర్షణలు, ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటూ ఆయన ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. శాంతిభద్రతలు కాపాడేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నోటీసులు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

## పంచాయతీ వార్డుల్లోనూ మనమే గెలవాలి

**పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు**



**(అంకుశం, అమరావతి, నవంబర్ 18):**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ఐక్యతను బలోపేతం చేసుకోవాలని, ప్రతి వార్డు స్థానంలోనూ కూటమి అభ్యర్థులే గెలవాలని దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయి ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. కూటమి బలపరిచిన అభ్యర్థులనే సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా గెలిపించాలని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. కూటమి ఐక్యత శాశ్వతంగా కొనసాగాలని, పొత్తు ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆదేశించారు. ఒక్క వార్డులో ఓడినా విశ్లేషిస్తానని, రెబల్స్‌ను తిరిగి పార్టీలోకి తీసుకోబోమని హెచ్చరించారు. ప్రతి ఇంటికి వెళ్లి, ప్రతి ఓటును అడగాలని కార్యకర్తలకు సూచించారు.

## తెలంగాణ విద్యార్థులకు గుడ్‌న్యూస్

- 'తెలంగాణ దర్శిని'తో ఉచిత విద్యా పర్యటనలు!
- రూ.26.30 కోట్లతో ప్రభుత్వం బృహత్తర కార్యక్రమం
- 2.92 లక్షల మంది విద్యార్థులకు అవకాశం..
- చరిత్ర, సంస్కృతి, ప్రకృతి అందాల సందర్శన



**హైదరాబాద్**

తెలంగాణ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త అవకాశాన్ని కల్పించేందుకు సిద్ధమైంది. చదువుతోపాటు చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి అందాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించే లక్ష్యంతో 'తెలంగాణ దర్శిని' పేరుతో ప్రత్యేక విద్యా పర్యటనల కార్యక్రమాన్ని చేపట్టనుంది. పుస్తకాల్లో చదివిన చారిత్రక కట్టడాలను స్వయంగా సందర్శించి వాటి విశిష్టతను తెలుసుకునేలా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసింది. సమగ్ర శిక్షా - మిగతా3లో

# ఎఫ్ఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలి

**జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి ఉరవకొండ నవంబర్ 18 ప్రజాతేజమ్ :** ఎఫ్ ఎం ఎస్ యాప్ ద్వారా రైతులకు ఎరువుల పంపిణీ చేపట్టేలా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి పేర్కొన్నారు.బుధవారం ఉరవకొండలోని మార్కెట్ యాడ్ ప్రాంగణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ నందు రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఉరవకొండ డివిజన్ ఏడిఏ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి మాట్లాడుతూ ఫ్రేమ్ వర్క్ ఫర్టిలైజర్ సేల్ ఎరువుల పంపిణీని పారదర్శకంగా సక్రమంగా మరియు అర్హులైన రైతులకు అందించటానికి ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ వ్యవస్థ అన్నారు.ఈ డిజిటల్ ఎరువుల పంపిణీ వ్యవస్థ ద్వారా రైతులకు అధిక ప్రయోజనాలున్నాయన్నారు. అవసరమైన ఎరువులు సరైన పరిమాణంలో లభిస్తాయని, భూమి వివరాలు పంట ఆధారంగా శాస్త్రీయ సిఫారసు,ఏ దుకాణం నుంచి తీసుకోవాలో ముందే ఎంపిక చేసుకోవచ్చని, క్యూఆర్ కోడ్ టోకన్ ద్వారా సులభంగా ఎరువులు పొందవచ్చన్నారు. ఎరువులను పొందడానికి రైతులు ఆధార్ నెంబర్ ఆధార్ కు లింక్ చేసిన మొబైల్ నెంబర్, భూమి వివరాలు, రైతు ఐడి. ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎఫ్ఎంఎస్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని,ఫార్మర్ ఐడి లేదా ఆధార్ నెంబర్ ద్వారా ఓటీపీ లాగిన్ కావడం, వెంటనే భూమి వివరాల నమోదు, పంటల ఎంపిక, ఎరువుల ఎంపిక, దుకాణం ఎంపిక, క్యూఆర్ కోడ్ పొందడం, ఎరువులు కొనుగోలు పూర్తి అవుతుందన్నారు.ఎరువుల దుకాణాల డీలర్లకు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి ఈ ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ పై పూర్తి అవగాహన కల్పించారు.జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయము టెక్నికల్ ఏవో వంశీకృష్ణ వివిధ ఈ-పాస్ మిషన్ల ద్వారా ఈ యాప్ ను అప్డేట్ చేయించారు.ఈ అప్డేషన్ క్రమంలో వచ్చే సాంకేతిక లోపాలను గురించి వివరిస్తూ ఈ-పాస్ మిషన్లను అప్డేట్ చేశారు. మరియు రైతు సేవ కేంద్ర సిబ్బంది గ్రామంలోని ప్రతి ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ఉన్న రైతులకు ఈ ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ పైన అవగాహన కల్పించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు రామకృష్ణ, పెన్నయ్య,లీనా,వసుంధర, వ్యవసాయ విస్తరణ అధికారులు,ఎరువుల దుకాణాల డీలర్లు మరియు రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.ళాశాల లో



అన్నదానం కోసం ప్రతి ఏటా లక్ష రూపాయలు విరాళం అందించేవారని, టైలర్ కుట్టు మిషన్ కేంద్రం ద్వారా ఆయన సహకారం తో కుట్టు శిక్షణ ఇవ్వడం జరిగిందని డెస్క్ లు ఇతర సదుపాయాలు కల్పించడం లో కీ. శే. చట్టా వెంకట నారాయణ సేవలు మరువలేనిది అన్నారు. ఈ సంతాప సమావేశం కార్యక్రమం లో కళాశాల కమిటీ తరుపున బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్ లెక్చరర్ లు కాలేజీ విద్యార్థిని లు తదితరులు పాల్గొన్నారు

## మాలదారణ భక్తులకు శ్రీ శిరిడి సాయి బాబా ఆలయం లో అన్నదానం కార్యక్రమం!

**35 వార్డు బీజేపీ నాయకులు డోలా రాజారెడ్డి శ్రీ మతి డోలా ఓబులమ్మ దంపతుల వితరణ**



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 18** ధర్మవరం శ్రీ షిరిడీ సాయి బాబా ఆలయం లో మాల ధారణ భక్తులకు ప్రతి రోజూ మధ్యాహ్నం ఉచిత భోజనం సౌకర్యం కల్పిస్తున్నట్లు 35 వార్డు బీజేపీ నాయకులు డోలా రాజారెడ్డి శ్రీ మతి డోలా ఓబులమ్మ దంపతులు తెలియజేసారు. ఈ సౌకర్యం మాలధారణ భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు

## షేక్ సునీహాను గెలిపించండి

## - విస్తృత ప్రచారం చేస్తోన్న విశ్వం



**పోరుమామిళ్ల, నవంబర్ 18(అంకుశం పత్రిక):** పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ వైఎస్సార్సీపీ సర్పంచ్ అభ్యర్థి షేక్ సునీహాను గెలిపించండి అంటూ... ఆమెకు మద్దతుగా వైఎస్సార్సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి బుధవారం గాండ్ల వీధి, మంగలి వీధి, చాకలి వీధి, కొలిమి బజార్ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి మేజర్ పంచాయితీని మున్సిపాలిటీ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు షేక్ సునీహాకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఓటును అభ్యర్థించడం జరిగింది. ఈప్రచార కార్యక్రమంలో పోరుమామిళ్ల వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీలను పర్యవేక్షించిన డిఆర్ఓ మలోల

**అంకుశం న్యూస్అనంతపురం, నవంబర్ 18:-** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విద్యార్థులకు క్విజ్ మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగిందని డిఆర్ఓ మలోల పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు యొక్క ప్రాముఖ్యత పై విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ మరియు వ్యాసరచన పోటీలను డి ఆర్ వో మలోల పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ.... భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విద్యార్థులకు ఓటు యొక్క ప్రాధాన్యత గురించి తెలియజేసేందుకు వ్యాసరచన మరియు క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీలలో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అతి ముఖ్యమైనదని18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం కలుగుతుందన్నారు. భవిష్యత్తును మార్చుకోవడానికి ఓటు హక్కు అనే ఆయుధాన్ని రాజ్యాంగం




ఇచ్చింది. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని యువత తమ ఓటును వినియోగించుకుని మంచి సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటీ కనకరాజు, ఎన్నికల విభాగపు సీనియర్ సహాయకులు సామ్యూల్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ టన్నెల్ ప్రాజెక్ట్‌పై తెలంగాణ సర్కార్ ఎందుకు మౌనంగా ఉంది?

నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టన్నెల్ పనులు చేపట్టినా రేవంత్ ప్రభుత్వం మౌనంగా ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. పొరుగు రాష్ట్రం ఇంత పెద్ద ఎత్తున ప్రాజెక్టు పనులు చేపడుతున్నా రేవంత్ ప్రభుత్వం ప్రభుత్వం ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని నిలదీశారు. నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ నుండి అక్రమంగా నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం భారీ టన్నెల్ ప్రాజెక్ట్ చేపట్టినా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదు? అని ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి అనుమతితోనే ఏపీ ప్రభుత్వం ఈ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టిందా? అని నిలదీశారు. ఏపీ ప్రభుత్వం ఇంత భారీ ఎత్తున ప్రాజెక్టు పనులు చేస్తున్నా తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేదా? అంటూ మండిపడ్డారు.

## కైలాసగిరికి సరికొత్త రోప్‌వే, సింగపూర్ తరహా గ్రావిటీ రైడ్

విశాఖపట్నంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కైలాసగిరిలో అత్యాధునిక రోప్‌వే నిర్మాణానికి మార్గం సుగమమైంది. దాదాపు ఏడాది కాలంగా వాయిదా పడుతూ వస్తున్న టెండర్ల ప్రక్రియ ఎట్టకేలకు ఖరారైంది. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) నిర్వహించిన తాజా బోర్డు సమావేశంలో ఈ ప్రాజెక్టు పనుల కేటాయింపునకు ఆమోదం లభించింది. టెండర్లలో ఎల్-1గా నిలిచిన ప్రస్తుత రోప్‌వే కాంట్రాక్టర్‌కే ఈ కొత్త ప్రాజెక్టు బాధ్యతలను అప్పగించారు. కైలాసగిరిపై 2004లో ఏర్పాటు చేసిన ప్రస్తుత రోప్‌వే తన 20 ఏళ్ల కాలపరిమితిని పూర్తి చేసుకుంది. దీంతో పాత రోప్‌వేను పూర్తిగా తొలగించి, దాని స్థానంలో సరికొత్త సాంకేతికతతో కూడిన రోప్‌వేను నిర్మించనున్నారు. ఈ కొత్త మార్గం కొండపై నుంచి తెలుగు మ్యూజియం వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంటుంది. దీనికి అదనంగా, అంతర్జాతీయ స్థాయిలో సింగపూర్ తరహాలో సుమారు 600 మీటర్ల పొడవున 'లూజ్ గ్రావిటీ రైడ్'ను కూడా పర్యాటకుల కోసం ఏర్పాటు చేయనున్నారు. శివపార్వతుల విగ్రహం సమీపంలో ఈ సాహసోపేత రైడ్ అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ... కైలాసగిరిని పర్యాటక ఆకర్షణ కేంద్రంగా మార్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. అందుకే రోప్‌వేను అక్కడి వరకు పొడిగించామన్నారు. విశాఖపట్నం ప్రజలకు లూజ్ గ్రావిటీ రైడ్ పరిచయం చేస్తామని తెలిపారు. శీతాకాలం కావడంతో విశాఖతో పాటు అరకు, లంబసింగి ప్రాంతాలకు పర్యాటకుల రాక గణనీయంగా పెరిగింది. ఈ తరుణంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వేగవంతం చేస్తోంది. కాంట్రాక్ట్ సంబంధిత అధికారిక పత్రాల అప్పగింత పూర్తయిన వెంటనే క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

## దూసుకొస్తున్న అక్వాన్ తుపాను..

## ప్రజల ప్రాణాలే తొలి ప్రాధాన్యత అన్న అనిత

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీవ్ర తుపానుగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఈ తుపాను ముప్పుపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉండటంతో రాబోయే 48 గంటల పాటు రాష్ట్ర యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ తుపాను గంటకు 3 కిలోమీటర్ల మందగమనంతో కదులుతూ మరింత బలపడుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు - విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని, కొన్ని సమయాల్లో గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని హోంమంత్రి ఆదేశించారు. అత్యవసర సహాయక చర్యల కోసం 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు స్థానిక అగ్నిమాపక సిబ్బందిని క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

## అర్షియా గెలుపు లక్ష్యంగా ఆదిత్య రెడ్డి దంపతుల ప్రచారం



**పోరుమామిళ్ల, నవంబర్ 18(అంకుశం పత్రిక):** పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి షేక్ అర్షియా విజయాన్ని కాంక్షిస్తూ ఆదిత్య రెడ్డి దంపతులు బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పట్టణంలోని 11, 12, 13, 14వ వార్డుల్లో బద్వేల్ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల రథసారథి, యువ నాయకుడు దేవసాని ఆదిత్య రెడ్డి, ఆయన సతీమణి సాహితి ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. షేక్ అర్షియాకు తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ... గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పోరుమామిళ్ల మేజర్ పంచాయితీలో అనేక మౌలిక వసతులు కల్పించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మరోసారి షేక్ అర్షియాను అఖండ మెజారిటీతో గెలిపిస్తే పోరుమామిళ్లను మున్సిపాలిటీ స్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు, మరిన్ని మౌలిక వసతులు కల్పించి ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. పోరుమామిళ్ల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ షేక్ అర్షియాకు అండగా నిలిచి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి , పార్టీ మండల అధ్యక్షులు సిఎం భాష, రాష్ట్ర మరియు జిల్లా మరియు మండల అనుబంధ విభాగాల నాయకులు ఈశ్వరమ్మ, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రాజీవ్ భాష, రాళ్లపల్లి నరసింహులు, షేక్ మస్తాన్, , దాదా పీర్,మహబూబ్ బాషా, సద్దాం, దాదాభాష, గంగయ్య, సాజిత్, జేబీబుల్లా, భాష, చాపాటి సాయి నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాస రచన పోటీలు చిత్రాలేఖనం పోటీలు




**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 18** 59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ధర్మవరం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల లో విద్యార్థుల కు వ్యాస రచన పోటీలు చిత్రాలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక గ్రంథాలయం అధికారిణి శ్రీ మతి అంజలి సౌభాగ్యవతి మరియూ కమిటీ అధ్యక్షులు చింతపులుసు పెద్దన్న పాల్గొని విద్యార్థులకు గ్రంథాలయం పట్ల అవగాహనా గురించి తెలియజేసారు.ఈ కార్యక్రమం లో శివమ్మ గంగాధర్,రమణ,రాము చెన్నకేశవులు ముకుంద తదితరులు పాల్గొన్నారు

## వ్యవసాయ సిబ్బందికి ఫిజియోథెరపీపై అవగాహన



**అంకుశం న్యూస్ ఉరవకుండ నవంబర్ 18 :** ఉరవకొండలోని మార్కెట్ యార్డ్ నందు ఉన్న ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ నందు వ్యవసాయ సిబ్బందికి ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్, సంతోష్ కుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతిరోజు క్షేత్రస్థాయి సందర్శనలు, మొబైల్ వాడకం,విధి నిర్వహణలో, ప్రతిరోజు ప్రయాణం, కార్యాలయాల్లో అధిక సమయాన్ని వెచ్చించడం వల్ల వచ్చే మెడ నొప్పి, వెన్ననొప్పి, భుజాల నొప్పి,మోకాళ్ళ నొప్పులు, సయటికా, బ్రెయిన్ స్ట్రోక్స్, హాట్ స్ట్రోక్స్ వంటి సమస్యలు తలెత్తినప్పుడు ఎటువంటి ఫిజియోథెరపీ నమూనాలను కలిగి ఉండాలో ప్రదర్శించి వివరించారు. అనంతరం వ్యవసాయ ఇబ్బందికి పరీక్షలు నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ ఏడిఏ ఎస్ సత్యనారాయణ, టెక్నికల్ ఏవో వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారులు రామకృష్ణ, పెన్నయ్య, లీనా, వసుంధర, వ్యవసాయ విస్తరణ అధికారులు,మరియు రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల సంక్షేమం, భద్రతకు టీటీడీ విద్యాసంస్థల్లో మెరుగైన సదుపాయాలు

**టీటీడీ విద్యాసంస్థలను సందర్శించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్, సభ్యులు**

**టీటిడి విద్యాసంస్థల నిర్వహణపై ప్రశంసలు**



**అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 18** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు, కమిషన్ సభ్యుల బృందం బుధవారం తిరుపతిలోని టీటీడీ విద్యాసంస్థలైన శ్రీ వేంకటేశ్వర బాలమందిరం, శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర బాలమందిరంలోని వంటశాల, స్టోర్‌ను పరిశీలించి, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. వంటశాల, స్టోర్‌లో పాటిస్తున్న పరిశుభ్రత, క్రమబద్ధమైన నిర్వహణ, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు. అనంతరం ఇతర విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్యా, సంరక్షణ, సంక్షేమ సదుపాయాలను పరిశీలించారు. బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, సమగ్ర సంక్షేమం కోసం టీటీడీ చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ పర్యటనలో కమిషన్ సభ్యులు గాంధీ బాబు, జిల్లా బాలల సంరక్షణ అధికారి వి. శివశంకర్, సంరక్షణ అధికారి శ్రీమతి జె. దేవయాని, టీటిడి ఏఈవో శ్రీమతి బి. అమ్ములు, హెడ్మాస్టర్ శ్రీమతి పద్మావతమ్మ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో 31వ వార్డులో డ్రైనేజీ కాలువ మరమ్మతులు

**ధర్మవరం పట్టణంలో సొంత నిధులతో డ్రైనేజీ కాలువ మరమ్మతులు చేపట్టిన బీజేపీ నాయకులు**



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 18** రూ. లక్ష వ్యయంతో ప్రజా సమస్య పరిష్కారానికి ముందుకొచ్చిన మాలిక్ భాష, షేక్షావలి ధర్మవరం పట్టణం, నవంబర్ 18:-- ధర్మవరం పట్టణంలోని ఎల్.సి.కె. పురం, 31వ వార్డు పరిధిలో లయన్స్ క్లబ్ పక్కన ఉన్న డ్రైనేజీ కాలువ దెబ్బతినడంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గారి సహకారంతో బీజేపీ 31వ వార్డు ఇన్‌చార్జి మాలిక్ భాష, షేక్షావలి గార్లు తమ సొంత నిధులతో మరమ్మతు పనులు చేపట్టారు. దెబ్బతిన్న డ్రైనేజీ కాలువకు మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.లక్ష వ్యయంతో పనులు ప్రారంభించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలువను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ సొంత నిధులను వెచ్చించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జరుగుతున్న మరమ్మతు పనులను మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబు వారితో కలిసి పరిశీలించి, పనుల పురోగతిని పర్యవేక్షించారు. మరమ్మతు పనులు నాణ్యతతో, సక్రమంగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమయంలో తమ వంతు బాధ్యతగా ముందుకొచ్చి సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని హరీష్ బాబు పేర్కొన్నారు.

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో సంతాప సమావేశం

**కళాశాల దాత చట్ట వెంకటనారాయణ కు ఘనంగా నివాళులు**





**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 18** ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలు మరియూ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మతి ఎమ్. వనితా వాణి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది బెంగుళూరు ప్రముఖ దాత చట్ట వెంకట నారాయణ నేడు హటాత్తుగా మృతి చెందడం పట్ల బుధవారం ఆయనకు ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సిబ్బంది విద్యార్థినిలు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వనిత వాణి మాట్లాడుతూ గతంలో ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో అన్నదానం కోసం ప్రతి ఏటా లక్ష రూపాయలు విరాళం అందించేవారని, టైలర్ కుట్టు మిషన్ కేంద్రం ద్వారా ఆయన సహకారం తో కుట్టు శిక్షణ ఇవ్వడం జరిగిందని డెస్క్ లు ఇతర సదుపాయాలు కల్పించడం లో కీ. శే. చట్టా వెంకట నారాయణ సేవలు మరువలేనిది అన్నారు. ఈ సంతాప సమావేశం కార్యక్రమం లో కళాశాల కమిటీ తరుపున బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్ లెక్చరర్ లు కాలేజీ విద్యార్థిని లు తదితరులు పాల్గొన్నారు

## సత్య సాయి జిల్లా చేనేత మహాసభల కరపత్రాల విడుదల



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 18** ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం శ్రీ సత్య సాయి జిల్లా రెండవ మహాసభల కరపత్రాల విడుదల.... ఏపీ చేనేత కార్మిక సంఘం ధర్మవరంలో శ్రీ సత్య సాయి జిల్లా రెండవ చేనేత మహాసభలు డిసెంబర్ 30. 31 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కరపత్రాలు విడుదల చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ,ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జే. వి .రమణ ,జిల్లా నాయకులు ఎస్ హెచ్ భాష మాట్లాడుతూ, చేనేత ముడి సరుకు వార్పు, రేషం,జరీ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని కార్మికులకు గిట్టుబాటు ధరలు లేవని, చేనేతపైన జిఎస్టి పూర్తిగా రద్దు చేయాలని, చేనేత కార్మికులకు పాత రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలని, ధర్మవరంలో చేనేత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ప్రత్యేక బ్యాంకును ఏర్పాటు చేయాలని ,ముఖ్యంగా చేనేత అఖిలపక్ష కార్మిక సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాల ఫలితంగా ఆగస్టు ఏడో తారీఖున చేనేత జాతీయ దినోత్సవం సందర్భంగా నేతన్న సేవా పథకం అమలు చేయడం జరిగినదని, అయితే శ్రీ సత్యసాయి జిల్లాలో అర్హులైన వేలాది మంది కార్మికులకు నేతన్న సేవా పథకం వర్తించలేదని ,ఇటువంటి కార్మిక సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం కోసం, భవిష్యత్తు ఆందోళన కార్యక్రమాల నిర్వహణ కోసం, చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం, కార్మికుల జీవనాధారం పెంచడం కోసం, పట్టణ ప్రముఖులు.. వ్యాపారస్తులు ఆర్థిక ...హార్థిక సహాయ సహకారాలు అందించి డిసెంబర్ 30 31 తేదీలలో జరగబోయే మహాసభలను అందరూ సహకరించి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏ ఖాదర్బాషా గుంపు హరి, చేనేత కార్మిక సంఘం నాయకులువి. వెంకట్ స్వామి, యు .ఆంజనేయులు, చౌడమ్ .వెంకటరమణ ,అన్నం సూరి ,కే తిమ్మరాజు, నిమ్మల. మల్లీ కార్జున ,చింత చంద్రశేఖర్, సీనప్ప. లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు టీడీపీ ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారం..

## ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన విజేతలు



**రాప్తాడు అంకుశం న్యూస్ నవంబర్ 18** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన రాప్తాడు మండల టీడీపీ జెడ్పీటీసీ గుండ్లమడుగు జయలక్ష్మి, ఎంపీపీ అభ్యర్థి దగ్గుపాటి శ్రీనివాసులుతో పాటు 8 మంది ఎంపీటీసీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 7న వెలువడిన ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన వీరు గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత వారికి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాప్తాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు, ఇందులో భాగంగా ఎంపీపీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అలాగే జెడ్పీటీసీ గుండ్లమడుగు జయలక్ష్మి అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

# భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి మహోత్సవాలకు వైభవంగా శ్రీకారం!

**మహా రథోత్సవంలో పాల్గొని రథాన్ని లాగిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్**

**దేశవిదేశాల నుంచి పోటెత్తిన సాయి భక్తులు.. భజనలు, వేదమంత్రోచ్ఛారణలతో దివ్యశోభను సంతరించుకున్న ప్రశాంతి నిలయం**










**అంకుశం ప్రతినిధిపుట్టపర్తి, నవంబర్ 18:** ప్రేమకు ప్రతిరూపం.. కరుణకు నిలువెత్తు నిదర్శనం.. మానవసేవే మాధవసేవ అని యావత్ ప్రపంచానికి చాటిచెప్పిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 101వ జయంతి మహోత్సవాలకు ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం పుట్టపర్తిలో అంగరంగ వైభవంగా శ్రీకారం చుట్టారు. భక్తుల హృదయాలను భక్తిపారవశ్యంలో ముంచెత్తుతూ నిర్వహించిన మహా రథోత్సవంతో పుట్టపర్తి పురవీధులన్నీ సాయినామ స్మరణతో మార్మోగాయి. దేశవిదేశాల నుంచి వేలాదిగా తరలివచ్చిన సాయి భక్తులతో ప్రశాంతి నిలయం ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. పుట్టపర్తి పట్టణమంతా రంగురంగుల అలంకరణలు, పచ్చని తోరణాలు, మంగళవాయిద్యాల నడుమ పండుగ శోభను సంతరించుకుంది. ఎటుచూసినా సాయి భక్తుల సందడి.. ఎక్కడ చూసినా భజన సంకీర్తనలు.. మరోవైపు వేదపండితుల మంత్రోచ్ఛారణలు.. భగవాన్ వారి దివ్య నామస్మరణతో పుట్టపర్తి పుణ్యక్షేత్రం భక్తిరసంతో పరవశించింది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య స్మృతులను స్మరించుకుంటూ నిర్వహించిన జయంతి వేడుకలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించాయి. లివిశేష పూజలు.. వైభవంగా రథోత్సవంలి జయంతి మహోత్సవాల్లో భాగంగా ప్రశాంతి నిలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రతం, సీతారాముల కల్యాణోత్సవం, వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తికి మహాభిషేకం, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి వ్రతం తదితర పూజా కార్యక్రమాలు వేలాదిమంది భక్తుల సమక్షంలో వైభవంగా జరిగాయి. వేదమంత్రాలు, భజన సంకీర్తనల మధ్య నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అనంతరం సీతారామలక్ష్మణులు, హనుమంతుడితో కూడిన ఉత్సవమూర్తులకు పల్లకిసేవ నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. అనంతరం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన మహా రథంపై ప్రతిష్ఠించి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తుల జయజయధ్వానాలు, సాయినామ స్మరణల మధ్య మహా రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లిమహా రథాన్ని లాగిన ప్రముఖులలి ఈ పవిత్ర జయంతి వేడుకలకు పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి శ్రీ పల్లె రఘునాథ్ రెడ్డి, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ ఆర్.జె. రత్నాకర్, ట్రస్ట్ సభ్యులు, పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి పట్ల తమకున్న భక్తిప్రపత్తులను చాటుకుంటూ ఉత్సవాల్లో పాల్గొన్నారు. జయంతి వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన మహా రథోత్సవానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ సంయుక్తంగా రథాన్ని లాగి ఘనంగా శ్రీకారం చుట్టారు. సత్యమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన మహా రథయాత్ర భక్తజన సందోహం మధ్య ప్రశాంతి నిలయం గోపురం గేటు వరకు అంగరంగ వైభవంగా కొనసాగింది. రథం ముందుకు కదులుతున్న కొద్దీ భక్తుల సాయినామ స్మరణలు, జయజయధ్వానాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి. రథయాత్ర వెంట భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ భగవాన్ వారి దివ్య నామాన్ని స్మరించుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు పురవీధుల వెంట భక్తులు బారులు తీరడంతో పుట్టపర్తి అంతటా అపూర్వమైన ఆధ్యాత్మిక సందడి నెలకొంది. లిమహాసమాధి దర్శనం.. భక్తులకు అన్నప్రసాద వితరణలి మహా రథోత్సవం అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్.జె. రత్నాకర్ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి మహాసమాధిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమస్త మానవాళిపై భగవాన్ వారి ప్రేమ, కరుణ, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. భగవాన్ వారు ప్రపంచానికి అందించిన సేవాతత్పరత, సమానత్వం, మానవతా విలువలకు ఈ కార్యక్రమం మరోసారి ప్రతిబింబంగా నిలిచింది. సేవే పరమధర్మమని బోధించిన భగవాన్ వారి ఆశయాలకు అనుగుణంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం వేడుకల్లో ప్రత్యేకతగా నిలిచింది. లిదేశవిదేశాల నుంచి తరలివచ్చిన సాయి భక్తులలి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 101వ జయంతి మహోత్సవాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాల నుంచి వేలాదిగా సాయి భక్తులు పుట్టపర్తికి తరలివచ్చారు. భక్తుల రాకతో పుట్టపర్తి పట్టణం కిటకిటలాడింది. భజన మండళ్ల సంకీర్తనలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలు, వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. భగవాన్ వారి దివ్య జీవితం, సేవా కార్యక్రమాలు, ప్రేమతత్వం, విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశాలను స్మరించుకుంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు. పుట్టపర్తిలో అడుగుపెట్టిన ప్రతి భక్తుడికి సాయినామ స్మరణ, భజనల మాధుర్యం, ప్రశాంతి నిలయంలోని ఆధ్యాత్మిక వాతావరణం అపూర్వమైన అనుభూతిని అందించాయి. లిప్రపంచానికి మార్గదర్శకంగా భగవాన్ వారి పంచమూల్యాలులిభగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు ప్రపంచ మానవాళికి అందించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే పంచమూల్యాలు నేటికీ కోట్లాదిమందికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. కులమతాలకు అతీతంగా సమస్త మానవాళిని ప్రేమించాలనే ఆయన బోధనలు విశ్వవ్యాప్త గుర్తింపు పొందాయి. విద్య, వైద్యం, తాగునీటి రంగాల్లో ఆయన అందించిన నిస్వార్థ సేవలు యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయి. ముఖ్యంగా పేదలకు నాణ్యమైన వైద్యం, విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, గ్రామీణ ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన సేవా కార్యక్రమాలు భగవాన్ వారి మానవతా దృక్పథానికి నిదర్శనంగా నిలిచాయి. మానవసేవే మాధవసేవ అనే ఆయన సందేశం తరతరాలకు స్ఫూర్తినిస్తోంది. మొత్తంగా సాయినామ స్మరణతో మార్మోగిన పుట్టపర్తి పురవీధులు.. భక్తజన సందోహంతో కళకళలాడిన ప్రశాంతి నిలయం.. విశేష పూజలు, భజన సంకీర్తనలు, వేదమంత్రోచ్ఛారణలతో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వైభవం.. ప్రముఖుల భాగస్వామ్యంతో సాగిన మహా రథోత్సవం.. భక్తులకు అన్నప్రసాద వితరణ.. ఇలా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 101వ జయంతి మహోత్సవాలకు పుట్టపర్తిలో అపూర్వమైన ఆధ్యాత్మిక ఆరంభం లభించింది. ప్రేమ, సేవ, శాంతి, మానవతా సందేశాలను ప్రపంచానికి మరోసారి చాటిచెబుతూ పుట్టపర్తి సాయి భక్తి వైభవంతో పులకించింది.

# రైతు సంక్షేమం, వినియోగదారుల లక్ష్యం

**సీఎస్ఆర్ సహకారంతో పుట్టపర్తిలో అత్యాధునిక సౌకర్యాలతో రైతు బజార్ నిర్మాణం**

**శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**





**అంకుశం న్యూస్ పుట్టపర్తి, నవంబర్, 18:** బుధవారం కర్ణాటక నాగేపల్లి నందు నిర్మాణంలో ఉన్న రైతు బజార్ పనులను ఈరోజు జాయింట్ కలెక్టర్ గారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. రైతులకు, వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ రైతు బజార్‌ను డిసెంబర్ మొదటి రెండు వారాల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు తమ పంట ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం కల్పించడంతో పాటు, పట్టణ ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, పండ్లు మరియు నిత్యావసర సరుకులను అందుబాటు ధరల్లో ఒకే చోట లభించేలా ఈ రైతు బజార్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ రైతు బజార్‌లో సుమారు 90 దుకాణాలను నిర్మిస్తున్నారు. వీటిలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు మరియు ఇతర నిత్యావసర వస్తువుల విక్రయాలకు ప్రత్యేకంగా అవకాశం కల్పించనున్నారు. రైతులు మరియు చిన్న వ్యాపారులపై ఆర్థిక భారం పడకుండా, దుకాణాలకు నామమాత్రపు అద్దెతో కేటాయించే విధంగా ప్రతిపాదించారు. దీనివల్ల రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు లభించడంతో పాటు, వినియోగదారులకు సరసమైన ధరలకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. రైతు బజార్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. రైతులు, వ్యాపారులు మరియు వినియోగదారుల సౌకర్యార్థం తాగునీటి వసతి, మరుగుదొడ్ల సదుపాయాలను ఏర్పాటు చేయాలని, కూరగాయలు మరియు పండ్ల విక్రయాల అనంతరం ఉత్పత్తయ్యే వ్యర్థాలను సక్రమంగా సేకరించి, వాటి ద్వారా సేంద్రియ ఎరువుల (కంపోస్ట్) తయారీకి అవసరమైన వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా మురుగునీటి పారుదల సమస్యలు తలెత్తకుండా శాస్త్రీయ పద్ధతిలో సోక్ పిట్ (ఇంకుడు గుంత) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతు బజార్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, పర్యావరణహిత విధానాలను అమలు చేసేలా అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ రైతు బజార్ నిర్మాణానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) నిధుల ద్వారా ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన ప్రశాంతి గ్యాస్ ఏజెన్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వాములవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోనూ రైతు బజార్ల నిర్మాణానికి వివిధ కార్పొరేట్ సంస్థలు జూ= నిధుల ద్వారా ముందుకు వచ్చి సహకరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం, కార్పొరేట్ సంస్థలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించవచ్చని తెలిపారు. ఈ సమీక్షలో పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు,జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి హాఫిజుల్లా,పుట్టపర్తి తహశీల్దార్ సంహిత,విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత మార్కెటింగ్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేసి రైతు బజార్‌ను ప్రారంభించేందుకు చర్యలు సూచించారు. రైతుల సంక్షేమం -- వినియోగదారులకు నాణ్యమైన సరుకులు -- స్థానిక మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతం అనే లక్ష్యంతో పుట్టపర్తి రైతు బజార్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

# ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల లో పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలి

**నూతన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులతో కీలక భేటీ**





**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 18** రాప్తాడు నియోజకవర్గం లో అన్ని స్థానాల్లో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పార్టీలో సముచిత ఉంటుందని ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత టిడిపి నేతలకు దిశా నిర్దేశం చేశారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్ మరియు రాప్తాడు మండలాల్లో నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో ఆమె అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. గురువారం ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో జరగనున్న మండల కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక, నూతన ఎంపీటీసీ సభ్యుల పదవీ స్వీకార ప్రమాణ కార్యక్రమం మరియు ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నికల ప్రక్రియపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. ప్రమాణ స్వీకారోత్సవం, ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నికల ప్రక్రియను అత్యంత ప్రశాంతంగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. పార్టీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థుల ఎంపికకు ప్రజా ప్రతినిధులంతా కట్టుబడి ఉండాలన్నారు. ఎక్కడా చిన్నపాటి పొరపాట్లకు కూడా తావివ్వకుండా ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుంచే ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని నూతన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ఆమె సూచించారు. సనప గ్రామంలో వైసీపీకి భారీ షాక్ ఆత్మకూరు మండలంలో వైసిపి కి గట్టి షాక్ తగిలింది. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ఎమ్మెల్యే పరిటాల సునీత నాయకత్వంపై నమ్మకంతో ఆత్మకూరు మండలంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో సనప గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సనప గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాప్తాడు నియోజకవర్గ వైసీపీ పోలింగ్ బూత్ లెవెల్ ఇంచార్జి గంగుల గోపాల్ రెడ్డితో పాటు కురుబ వెంకటార్జున, కురుబ సిద్దయ్య, కురుబ రమేష్ తదితరులు ఎమ్మెల్యే పరిటాల సునీత సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని, గ్రామ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు.

# గ్రామ పంచాయతీ నామినేషన్లకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు

**14 కేంద్రాల్లో 131 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది నియామకం**





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 18:** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో మండపేట రూరల్ సర్కిల్ పరిధిలో పటిష్ట పోలీస్ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల పరిధిలోని 42 గ్రామ పంచాయతీలు, 502 వార్డులు, 189 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికల భద్రతకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన 14 కేంద్రాల్లో మొత్తం 131 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండపేట మండలంలో ద్వారపూడి, తాపేశ్వరం, వెలగతోడు, ఏడిద, రాయవరం మండలంలో వెదురుపాక, రాయవరం, చెల్లూరు, వెంటూరు, కపిలేశ్వరపురం మండలంలో వల్లూరు, గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి ముందస్తు బైండోవర్ చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడమే పోలీస్ శాఖ లక్ష్యమని సీఐ స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

# ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ధ్యేయం

**శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మంగళకర డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీల నిర్వహణ**



**అంకుశం న్యూస్ పుట్టపర్తి నవంబర్ 18:** యువతలో ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడంతో పాటు, బాధ్యతాయుతమైన ఓటర్లుగా వారిని తీర్చిదిద్దే లక్ష్యంతో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా స్థాయి వ్యాసరచన మరియు క్విజ్ పోటీలను బుధవారం నాడు పుట్టపర్తి మండలం, జగరాజుపల్లిలోని మంగళకర డిగ్రీ కళాశాలలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత మండల స్థాయి మరియు నియోజకవర్గ స్థాయిలలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి, విజేతలుగా నిలిచిన సుమారు 60 మంది విద్యార్థులు నేటి జిల్లా స్థాయి పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎ.శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శమని, దానిని మరింత బలోపేతం చేయడంలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల పనితీరు, మరియు ఓటర్ల హక్కుల పట్ల విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, తద్వారా తమ కుటుంబ సభ్యులకు మరియు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. పోటీలలో పాల్గొంటున్న విద్యార్థుల ప్రతిభను కలెక్టర్ అభినందిస్తూ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్ ఓటర్లైన విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థపై సమగ్ర అవగాహన కల్పించడం, నైతిక ఓటింగ్ ప్రాధాన్యతను వివరించడం మరియు ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ పోటీల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, జూజ కో-ఆర్డినేటర్లు మరియు వివిధ కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సనప గ్రామంలో వైసీపీకి భారీ షాక్....



**అంకుశం న్యూస్, రాప్తాడు, నవంబర్:18** ఆత్మకూరు మండలంలో వైసిపి కి గట్టి షాక్ తగిలింది. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ఎమ్మెల్యే పరిటాల సునీత నాయకత్వంపై నమ్మకంతో ఆత్మకూరు మండలంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో సనప గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సనప గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాప్తాడు నియోజకవర్గ వైసీపీ పోలింగ్ బూత్ లెవెల్ ఇంచార్జి గంగుల గోపాల్ రెడ్డితో పాటు కురుబ వెంకటార్జున, కురుబ సిద్దయ్య, కురుబ రమేష్ తదితరులు ఎమ్మెల్యే పరిటాల సునీత సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని, గ్రామ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు.

## నేడు మండల ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశం

## ఎంపీడీవో విజయలక్ష్మి



**రాప్తాడు అంకుశం న్యూస్ నవంబర్ 18** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాప్తాడు మండల ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ?ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం ఈ నెల 7న ఫలితాలు వెలువడిన నేపథ్యంలో, నూతనంగా ఎన్నికైన సభ్యుల పదవీకాలం ప్రారంభం కోసం ఈ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండల పరిషత్ కో-ఆప్టెడ్ సభ్యుడితోపాటు మండల ప్రజా పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ), ఉపాధ్యక్ష (వైస్ ఎంపీపీ) ఎన్నిక ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మొదటి సమావేశాల తేదీ నుంచే నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల ఐదేళ్ల పదవీకాలం ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక సమావేశం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

## విద్యార్థుల సృజనాత్మకతకు చిత్రలేఖనం వేదిక

**చిన్నతనం నుంచే పోటీతత్వం పెంపొందించాలి : ఉషారాణి**



**డి. హీరేహాల్, నవంబర్ 18 అంకుశం** 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా డి. హీరేహాల్ శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి హెచ్. ఉషారాణి మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, నైపుణ్యాలు, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాజిదా, ఉపాధ్యాయులు మహాలక్ష్మి, రోజా, వీణ పాల్గొన్నారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు ఉషారాణి తెలిపారు.


## రాప్తాడు మండలంలో పంచాయతీ ఎన్నికల సమరం.

**బరిలో 99 మంది సర్పంచ్, 347 మంది వార్డు అభ్యర్థులు**



**రాప్తాడు అంకుశం న్యూస్ నవంబర్ 18** మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీలలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన బుధవారంతో ముగియడంతో, ఆమోదించిన అభ్యర్థుల జాబితాను ఎంపీడీవో బి విజయలక్ష్మి వెల్లడించారు. మండలంలోని 16 సర్పంచ్ స్థానాలకు 99 మంది, 154 వార్డు సభ్యుల స్థానాలకు 347 మంది అభ్యర్థులు తుది బరిలో నిలిచారు. ?పంచాయతీల వారీగా బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలను పరిశీలిస్తే.. రాప్తాడు పంచాయతీలో సర్పంచ్ స్థానానికి 9 మంది, 14 వార్డులకు 53 మంది పోటీ పడుతున్నారు. ప్రసన్నాయపల్లిలో సర్పంచ్‌కు 6, 14 వార్డులకు 34 మంది, మరూరులో సర్పంచ్‌కు 8, 12 వార్డులకు 30 మంది, బండమీదపల్లిలో సర్పంచ్‌కు 4, 12 వార్డులకు 19 మంది అభ్యర్థులు నిలిచారు. అలాగే 10 వార్డులు ఉన్న పంచాయతీలైన గొందిరెడ్డిపల్లిలో సర్పంచ్‌కు 8, వార్డులకు 27 మంది, హంపాపురంలో సర్పంచ్‌కు 8, వార్డులకు 13 మంది, చెర్లోపల్లిలో సర్పంచ్‌కు 7, వార్డులకు 18 మంది బరిలో ఉన్నారు. ?8 వార్డులు చొప్పున ఉన్న మిగిలిన పంచాయతీలలో.. గొల్లపల్లిలో సర్పంచ్ స్థానానికి అత్యధికంగా 12 మంది, వార్డులకు 21 మంది, పాలచెర్లలో సర్పంచ్‌కు 6, వార్డులకు 17 మంది, గాండ్లపర్తి సర్పంచ్‌కు 6, వార్డులకు 16 మంది, జి.కొత్తపల్లిలో సర్పంచ్‌కు 6, వార్డులకు 15 మంది పోటీ పడుతున్నారు. బొమ్మేపర్తిలో సర్పంచ్‌కు 5, వార్డులకు 16 మంది, భోగినేపల్లిలో సర్పంచ్‌కు 4, వార్డులకు 16 మంది, ఎర్రగుంట్లలో సర్పంచ్‌కు 4, వార్డులకు 16 మంది బరిలో నిలిచారు. పుల్లలరేవులో సర్పంచ్‌కు 3, వార్డులకు 20 మంది, బుక్కచెర్లలో సర్పంచ్‌కు 3, వార్డులకు 16 మంది చొప్పున ఆమోదం అయినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఈనెల 21న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు.

## మాజీ ఎంపీపీ ప్రతాప్ నాయుడు మాతృమూర్తి చిత్రపటానికి నివాళులర్పించిన పయ్యావుల కేశవ్



**అంకుశం న్యూస్ విడపనకల్ నవంబర్ 18 :** విడపనకల్లు మండలం మాజీ ఎంపీపీ ప్రతాప్ నాయుడు మాతృమూర్తి స్వర్గస్తులైన నేపథ్యంలో పెంచలపాడు గ్రామానికి వెళ్లి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వారి నివాసానికి చేరుకుని, మాతృమూర్తి పవిత్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ, ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం దుఃఖసాగరంలో ఉన్న మాజీ ఎంపీపీ ప్రతాప్ నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మనోధైర్యాన్ని కల్పించారు. ఆ మాతృమూర్తి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.